ఓం శ్రీసాయిరాం

# వాల్మీకి మహర్షి

***వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే***
***వేదః ప్రాచేతసా దాసీత్, సాక్షాత్ రామాయణాత్మనా.***

సముద్రము ఈదుటయందును, కొండలు ఎక్కుటయందును అతి సాహసమును ప్రదర్శిస్తున్నాము. అనేకవిధములైన ఆటపాటలందు తమ నైపుణ్యమును ప్రదర్శిస్తున్నారు. కాని, ఇంద్రియములను అరికట్టు విషయమునందు మాత్రము ఎట్టి ధైర్యసాహసములను ప్రదర్శించక, అబలుడై వాటికి దాసానుదాసుడై ప్రవర్తిస్తుంటాడు. మన ధైర్యసాహసములను ఇంద్రియ నిగ్రహ విషయంలో ప్రదర్శించినప్పుడే మనం నిజమైన వీరులము కాగలము. సత్కర్మలను సాధించుట కొరకు మాత్రమే ధైర్యసాహసములను ప్రదర్శించుటకు పూనుకొనవలెను. ధైర్యమన్నది ఒక్కటియే, ఆ ధైర్యమును చెడ్డ మార్గమునందు ప్రవేశ పెట్టితిరా పూర్తిగా చెడ్డవారిగా మారిపోవుదురు. మంచి విషయమునందు ప్రవేశపెట్టితిరా అంతకంటెను మంచి ప్రాప్తి లభించే టట్లు చేసుకుంటారు.

భారత చరిత్రలో శిరోధారకములైన తపఃశక్తి సంపన్నులుగా మానవ ఆదర్శమూర్తులై, పూజనీయులుగా మారిన వారిలో వాల్మీకిది ప్రథమ స్థానము. వాల్మీకి పూర్వము దోపిడివానిగా ప్రసిద్ధిచెంది బాటసారుల ప్రాణములను తీయుటకు కూడను వెనుదీయక, అన్యాయ అక్రమ అనాచారములతో సాహస జీవితం గడుపుతున్నాడు. ఆ ధైర్యమును ఈ పాడు బుద్ధులయందు ప్రవేశపెట్టి, అనేక రకములైన దుర్మార్గములను చేయుచూ వచ్చాడు. కానీ, మహనీయులు తమ దర్శన, స్పర్శన, సంభాషణల వలన సత్యమును గుర్తింపచేసి, 'నాయనా! నీవు చేయుచున్నట్టి కర్మఫలితమును నీవొక్కడివే అనుభవించవలసియున్నది. ఎవరి నిమిత్తమై నీవీ పాప కృత్యములతో ధనమును ఆర్జించుచున్నావో వారు నీ పాపకర్మ ఫలితమును అనుభవించుటలో ఎట్టి భాగమును అందుకొనరు' అని సప్తఋషులు చేసిన దివ్యబోధను శ్రవణం చేయుటచేత తాను పవిత్రమైన మార్గమునందు ప్రవేశించి ఆనాటినుండియు ఆ మహర్షులయొక్క ఆజ్ఞను శిరసావహించి 'రామ, రామ' అనుచు భగవన్నామమును చింతించుకుంటూ దేహముపై పుట్టలు పెరిగిననూ పూర్వ ధైర్యమునే ప్రవేశపెట్టుటచే దేహభ్రాంతి యేమాత్రమును చింతించక ఆ పవిత్రమైన దైవనామమునందే లక్ష్యమునుంచి జన్మను సార్థకము చేసుకున్నాడు.

ప్రాచేతసుడనగా ఎవరు? వాల్మీకి. ఇతనికి ప్రాచేతసుడనే పేరు ఎట్లా వచ్చింది? వరుణనకు 'ప్రచేతుడు' అనేది మరొక పేరు. నిరంతరము దైవ చింతన చేత తనను, తన దేహమును మరచాడు రత్నాకరుడు. శరీరముపైన పుట్టలు పెరిగాయి. అతని రూపము మరుగైపోయింది. అప్పుడు వరుణుడు కుంభవృష్టి కురిపించాడు. దానితో అతని శరీరంపైన పుట్టగానున్న మట్టి కరిగి పోయింది. తద్వారా వాల్మీకి బయట పడ్డాడు. ఈవిధంగా వరుణుని అనుగ్రహంచేత బయటకు వచ్చిన వాడు కనుక, ఇతనికి ప్రాచేతసుడు అని పేరు వచ్చింది. ఈనాటి మానవుడు కూడా తనకు అంటుకున్న అహంకారమమకారములనే మట్టిని దైవ చింత చేత యేనాడు వదుల్చుకొనునో ఆనాడే తాను పవిత్రుడు కాగలడు.

లోకములో కవులనేకులు అనేక భాషలలో పవిత్ర చరిత్రమైన రామాయణమును రచించి తరించిరి. వారిలో ప్రప్రథమమున సంస్కృత భాషయందు రచించిన ప్రథమ కవి వాల్మీకి. వాల్మీకి రామాయణము సుధాసముద్రము.

కనుకనే, ఈ రామాయణమునందున్న భాగములన్నింటికి కాండములని పేరు పెడుతూ వచ్చారు. కాండమనగా జలము. ఇక్కడ ఒక్కొక్క బిందువు ప్రాణప్రదమైనట్టుగా, ఒక్కొక్క పదము ధర్మార్థకామమోక్షములనే పురుషార్థప్రదంగా గోచరిస్తూ వచ్చింది. హృదయమనే సముద్రమందు బుద్ధి అనే ముత్యపుచిప్ప, సరస్వతి అనే వర్షబిందువునకై వేచి ఉండటమనే దానిని నిరూపిస్తూ వచ్చారు. రామ చరిత్ర అనే సరోవరమందు స్నానము చేసి పునీతమైనవాడు మాత్రమే, బ్రహ్మలోకమందున్న శారదాంబయొక్క అనుగ్రహము పొందుటకు అర్హుడౌతాడు. రామజననము మొదలు రావణ వధ వరకు రాముని కేవలము ఆదర్శ మానవునిగా నిరూపిస్తూ వచ్చాడు వాల్మీకి. ఈ రామాయణమునందు అతిశయోక్తిగాని, అనృతముగాని, కల్లలుగాని కన్పించదు. కారణమేమనగా, వాల్మీకి గ్రంథమును రచించుటకు పూర్వమే ఒక గొప్ప ప్రతిజ్ఞ పట్టాడు. 'ఉన్న విషయమును విన్నవింతునుగాని కల్పితములుగాని, కల్లలుగాని నా కలమునందు చేరవు' అని ప్రతిజ్ఞ చేశాడు. రాముడు సాక్షాత్ భగవంతుడని తెలియకపోలేదు. కానీ, మానవ సహజమైన నైతిక ప్రవర్తనకు ఆదర్శమైన జీవితాన్ని అందించే నిమిత్తమై, రామాయణమందు రాముని కేవలము మానవ ఆదర్శపు జీవిగా నిరూపిస్తూ వచ్చాడు.

రాముడు అయోధ్యను పరిపాలిస్తున్న రోజులలో వాల్మీకి రామాయణమును రచించాడు. దానిని ప్రపంచానికి చాటి, ప్రజల హృదయాలలో నాటి వారిని పవిత్రులను గావించాలని సంకల్పించుకున్నాడు. రామచరితము పద్యరూపంలోను, గద్యరూపంలోను, గేయరూపంలోనూ అన్ని విధములుగా హృదయాన్ని ఆకర్షిస్తుంది. ఇందులోని శ్లోకాలు శోకనివారణ గావిస్తాయి. ఇట్టి పవిత్రమైన రామాయణాన్ని ప్రజలలో ఏరీతిగా ప్రచారం చేయాలని వాల్మీకి యోచిస్తూ కూర్చున్న సమయంలో ఋషివేషధారులు, మధురగాయకులు అయిన కుశలవులు వచ్చి నమస్కరించి నిలిచారు. వీరు జంటపక్షులు. వీరి శక్తి సామర్థ్యములను వర్ణించుటకు వీలుకాదు. ఎవ్వరికీ వెఱువరు. వెనుకంజ వేయరు. బిడియమనేది వీరియందు లేనే లేదు. వాల్మీకి వీరిరువురిని చూచి, 'లవకుశులారా! నేను ఎంతో శ్రమించి నిండు హృదయంతో, పవిత్రమైన భావంతో ఈ రామాయణమును వ్రాసాను. దీనిని మీరు ప్రపంచమునకు చాటాలి' అని ఆదేశించాడు. లవకుశులు అత్యంత వినయంతో నమస్కరించి, 'గురూజీ! మాకు సెలవివ్వవండి. మేము గ్రామగ్రామము వీధివీధి తిరిగి ప్రచారం చేస్తాము' అన్నారు. ఒకానొక ప్రదేశంలో ఋషులందరూ సమావేశమై ఉండగా ఈ లవకుశులు వారి మధ్యకు వెళ్ళి కమ్మని కంఠంతో పవిత్రమైన రామకథను గానంచేయగా ఋషులందరూ ముగ్ధులై ఆనందబాష్పములు రాల్చారు. లవకుశులను హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తూ రామాయణమును ప్రపంచమంతటా ప్రచారం చేయవలసిందిగా కోరారు.

లవకుశులు అయోధ్యలో ప్రవేశించి రామకథను శ్రావ్యంగా గానం చేస్తుంటే బజారులో ఎక్కడివారు అక్కడే నిలిచిపోయారు. వారి హృదయాలు ఆనందంతో నిండిపోయాయి. ఎక్కడ వున్నామనే చింతనే వారికి లేదు. అదే భావ సమాధి. ఆ సమయంలో రథమునెక్కి అటువైపు వచ్చిన రాముడు కూడా లవకుశుల రామకథాగానము విని ముగ్ధుడయ్యాడు. తన భవనమునకు వచ్చి రామకథా గానం చేయవలసిందని తాను పిలిచినట్లుగా లవకుశులకు చెప్పమని ఇంటికి వచ్చిన తరువాత మంత్రులను పంపించాడు. ఈవిధంగా సామాన్య ప్రజల ముందేగాక సాక్షాత్తు శ్రీరామచంద్రుని సమక్షంలోను లవకుశులు రామకథను గానంచేశారు. రామచరితమును రాముడు విని ఆనందించాడు.